క్లుప్తంగా

30 పడకల సీహెచ్‌సీ ప్రారంభోత్సవానికి సిద్ధం



దెందులూరులో ప్రారంభోత్సవానికి సిద్ధమైన 30 పడకల సీహెచ్‌సీ

దెందులూరు: దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి కృషితో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పూర్తి సహాయసహకారాలతో నియోజకవర్గం ముఖ్య కేంద్రమైన దెందులూరు నియోజకవర్గంలో 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ) నిర్మితమైంది. 24 గంటలూ వైద్యసేవలందించేలా డిప్యూటీ సివిల్ సర్జన్, ఐదుగురు వైద్యులతో రోగులకు వైద్యసేవలందించేందుకు 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను ఎమ్మెల్యే మంజూరు చేయించి నిర్మాణం పూర్తి చేయించారు. ఇకపై దెందులూరు సమీప గ్రామాల్లో ప్రజలకు 24 గంటలు పాటు వైద్యసేవలు పూర్తి సౌకర్యాలతో అందుబాటులోకి రానున్నాయి.

సీసీ రోడ్డు ప్రారంభం



సీసీ రోడ్డు ప్రారంభిస్తున్న వృద్ధి ఇన్‌ఫ్రా యాజమాన్యం

జంగారెడ్డిగూడెం : పారిజాతగిరి వద్ద భక్తుల సౌకర్యార్థం నూతనంగా నిర్మించిన సిమెంట్ రోడ్డును వృద్ధి ఇన్ఫ్రా అధినేత కావూరు సురేష్, రాంబాబు, నాగభూషణం ప్రారంభోత్సవం చేశారు. పాత రోడ్డుకు అనుసంధానంగా రూ. 15 లక్షల వ్యయంతో సీసీ రోడ్డును ఏర్పాటు చేశారు. కొండపైకి వెళ్లే ఘాట్ రోడ్డు మలుపు వద్ద ప్రమాదాల నివారణ కోసం ఈ రోడ్డు నిర్మించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ ఎం.రాంబాబు, ప్రధానార్చకులు రవికుమారాచార్యులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెంలో లలితా పారాయణం



చింతాలమ్మ ఆలయం వద్ద లలితా పారాయణం చేస్తున్న భక్తులు

కొయ్యలగూడెం : మకర సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని కనుమ రోజు సోమవారం కొయ్యలగూడెం గ్రామదేవత శ్రీ చింతాలమ్మ అమ్మవారి ఆలయం వద్ద లలితా సహస్రనామ పారాయణ నిర్వహించారు. రైతు అభ్యుదయ సంఘం, ఆలయ అభివృద్ధి కమిటీల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మహిళా భక్తులు పాల్గొని అమ్మవారిని స్తుతిస్తూ పారాయణం చేశారు. ఐదు రోజుల పాటు అమ్మవారి ఆలయం వద్ద సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన



కూచిపూడి నృత్య ప్రదర్శన

భీమవరం (ప్రకాశంచౌక్): శ్రీ మావుళ్లమ్మ అమ్మవారి వార్షికోత్సవాల్లో భాగంగా సంక్రాంతి రోజు అమ్మవారి కళావేదికపై ఏర్పాటు చేసిన శ్రీ మయూరి నృత్యాలయం హైదరాబాద్ ఆధ్వర్యంలో కూచిపూడి నృత్యప్రదర్శన భక్తులను అలరించింది. కూచిపూడి నృత్యకారిణి దొంగ అనిషిత కూచిపూడి నృత్య అభినయాన్ని ప్రశంసించారు. అలాగే జగత్ విజేత నాట్యమండలి మిలట్రీ మాధవరం ఆధ్వర్యంలో ప్రదర్శించిన కనకదుర్గ మహత్యం నాటకం ప్రేక్షకులను ఆకట్టుకుంది. అలాగే సోమవారం పిప్పళ్ల ప్రసాద్ భీమవరం వారిచే సాయి సంకీర్తనలు, శ్రీమావుళ్లమ్మవారి నాట్యమండలిచే ప్రదర్శించిన రంగస్థల ఆణిముత్యాలు నాటకం ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో నీరుల్లికూరగాయ పండ్ల వర్తక సంఘం, అమ్మవారి ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మోటారు సైక్లిస్టుకు గాయాలు

తాడేపల్లిగూడెం రూరల్: మోటారు సైకిల్ అదుపు తప్పి రోడ్డుపై పడటంతో వ్యక్తికి గాయాలైన సంఘటన ముత్యాలంబపురం సమీపంలో జరిగింది. ఈ సంఘటనకు సంబంధించి రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పాలకోడేరు మండలం మోగల్లు గ్రామానికి చెందిన సాంబ్రాణి సూర్యనారాయణ ఉంగుటూరులోని బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి తాడేపల్లిగూడెం వైపు వేగంగా వస్తుండగా, ముత్యాలంబపురం వద్ద మోటారు సైకిల్ అదుపు తప్పి రోడ్డుపై పడింది. దీంతో సూర్యనారాయణ తలకు గాయమైంది. బాధితుడి బావమరిది యర్రగోగుల వెంకటేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు రూరల్ పోలీసులు తెలిపారు.

ఉత్సాహంగా సంక్రాంతి సంబరాలు

- ఉత్సాహంగా పాల్గొన్న ప్రజలు, సినీనటులు
- సంప్రదాయ క్రీడలతో గ్రామాల్లో సందడి



సంప్రదాయ పద్ధతిలో కత్తులు లేకుండా బరిలో తలపడుతున్న కోడిపుంజులు

పెదవేగి : నియోజకవర్గవ్యాప్తంగా సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. పలు గ్రామాల్లో వివిధ సంప్రదాయ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. శుక్రవారం మొదలైన కోడి పందేలు వరుసగా మూడు రోజులు కొనసాగాయి. బరుల వద్ద పేకాట, గుండాట ఏర్పాటు చేశారు. పెదవేగి మండలంలో ప్రకాష్‌నగర్, కవ్వగుంట, దిబ్బగూడెం, పెదవేగి, కూచింపూడి, కొండలరావుపాలెం, విజయరాయి, భోగాపురం, పెదకడిమి, వేగివాడ తదితర గ్రామాల్లో కోడి పందేలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ సంప్రదాయంలో భాగంగా ఎటువంటి వివాదాలకు తావులేకుండా కోడి పందేలు నిర్వహించామన్నారు.

సంప్రదాయ వస్త్రాలంకరణలో యువత సందడి

గణపవరం: సంక్రాంతి రోజున కొందరు యువతీ యువకులు తెలుగుదనం ఉట్టిపడే విధంగా సంప్రదాయ దుస్తులు ధరించి సందడి చేస్తున్నారు. గణపవరం, నిడమర్రు మండలాల్లోని పలువురు యువతీ యువకులు సంక్రాంతి రోజున సంప్రదాయ వస్త్రధారణతో చూపరులను ఆకట్టుకున్నారు. కొన్నేళ్ల క్రితం సంక్రాంతి పండుగకు ఇలాంటి బట్టలే ధరించేవారమంటూ పెద్దలు గుర్తు చేసుకున్నారు. యువకులు పంచెకట్టి చొక్కా, లాల్చీలు ఖండువా ధరించగా, యువతులు పట్టు పరికిణీలు, లంగా ఓణీలతో దర్శనమిచ్చి అందరినీ ఆకర్షించారు.

ముగిసిన కోడి పందేల జాతర

భీమడోలు: సంక్రాంతి సందర్భంగా సంప్రదాయంలో భాగంగా నిర్వహించిన కోడి పందేలు సోమవారం సాయంత్రంతో ముగిసాయి. సంక్రాంతి రోజు ఆదివారం సాయంత్రం జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోలీసులు ఆకస్మిక దాడుల చేసారు. కోడి పందేలు మినహా మిగిలిన జూదక్రీడలను నిలిపివేసారు. సోమవారం ఉదయం యథావిధిగా కోడి పందేలు, జూదక్రీడలు జోరుగా సాగాయి. శిబిరాల వద్ద స్వల్ప ఘర్షణలు చేటు చేసుకోవడంతో కోడి పందేలు, జూద క్రీడలు నిర్వహించేది లేదంటూ పోలీసు యంత్రాంగం హెచ్చరికలు జారీ చేశారు. మండలంలోని భీమడోలు, గుండుగొలను, పూళ్ల, పోలసానిపల్లి, సూరప్పగూడెం, అంబర్‌పేట, ఆగడాలలంక తదితర గ్రామాల్లో 17 నుంచి 20 బరులను ఏర్పాటు చేసి కోడి పందేలు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి తరలి వచ్చిన జనంతో ఆ ప్రాంతమంతా కిక్కిరిసింది. కార్లు, మోటార్‌బైక్‌లు బారులు తీరాయి. గుండుగొలనులో పెద్ద ఎత్తున పేకాట శిబిరాలు ఏర్పాటు చేసారు. గుండుగొలను బ్రాహ్మణ చెర్వు వద్ద టీడీపీ మద్దతులు భారీ టెంట్లు ఏర్పాటు చేసి, విద్యుద్దీపాల వెలుతురులో పందేలు రాత్రి వేళల్లో సైతం నిర్వహించారు. యువతులు, మహిళలు ఈ పందదేలు తిలకేందుకు తరలించారు.

బరుల వద్ద సందడి

గణపవరం: మూడురోజులుగా కోలాహలంగా సాగిన కోడిపందేల జాతర ముగిసింది. సోమవారం సాయంత్రం అన్ని చోట్లా కోడి పందేలను ముగించారు. మూడు రోజులుగా ఎంతో కోలాహలంగా జరిగిన పందెం బరులవద్ద ప్రశాంతత నెలకొంది. మండలంలోని పలుచోట్ల కోడిపందేల బరులు ఏర్పాటు చేశారు. చిన్నా పెద్దా, ఆడా, మగా తేడాలేకుండా అంతా పందేలు తిలకించేందుకు బరుల వద్దకు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

సంప్రదాయబద్ధంగా పండుగలు



ప్రజలందరూ సుఖసంతోషాలతో సంక్రాంతి పండుగను వైభవంగా జరుపుకున్నారు. దెందులూరు నియోజకవర్గంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది ఎడ్ల పందేలు, పలు ఆటల పోటీల నిర్వహణ ఆకట్టుకున్నాయి. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా ప్రజలు కుటుంబ సభ్యులతో కలిసి గ్రామాల్లో పండుగను ఆస్వాదించారు.

– కొఠారు అబ్బయ్యచౌదరి
ఎమ్మెల్యే దెందులూరు నియోజకవర్గం

చాలా ఆనందంగా ఉంది



ఏటా ఆంధ్ర రాష్ట్రంలో సంక్రాంతిని పురస్కరించుకుని నిర్వహించే సంప్రదాయ క్రీడా పోటీలు, పందేలకు హాజరవుతాను. వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసి ప్రజలను అలరింపచేసి, నేను కూడా ఆహ్లాదకరంగా గడుపుతాను. సంక్రాంతి ఉత్సవాల్లో పాల్గొనడం నాకు చాలా ఆనందంగా ఉంది.

– శివారెడ్డి సినీనటుడు, మిమిక్రీ ఆర్టిస్ట్



గుండుగొలనులో ఢీకొడుతున్న పందెం కోళ్లు



మొయ్యేరులో తలపడుతున్న పందెంకోళ్లు



సంప్రదాయ దుస్తుల్లో యువత

జూద క్రీడలపై పోలీసుల దాడి

ద్వారకాతిరుమల: సంక్రాంతి పండుగ మూడు రోజులు కోడి పందేలు, పేకాట, గుండాటలు నిర్వహించిన పలువురిపై కేసులు నమోదు చేసినట్లు ద్వారకాతిరుమల ఎస్సై టి.సుధీర్ తెలిపారు. తొమ్మిది కోడి పందేల స్థావరాలపై దాడిచేసి, 24 మందిపై కేసు నమోదు చేసినట్టు చెప్పారు. వారి వద్ద నుంచి రూ.11,250 లు నగదు, 9 కోళ్లు, 25 కత్తులను స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే నాలుగు పేకాట స్థావరాలపై దాడిచేసి, 9 మందిపై కేసు నమోదు చేసి, రూ.4,500 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. అదేవిధంగా ఏడు గుండాట స్థావరాలపై దాడిచేసి, 15 మందిపై కేసు నమోదు చేసి, వారి వద్ద నుంచి 7,450 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇదిలా ఉంటే పండుగ మూడు రోజులు మండలంలో కోడి పందేలు జోరుగా సాగాయి. ద్వారకాతిరుమల, తిమ్మాపురం, తిరుమలంపాలెం గుణ్ణంపల్లి, ఎం.నాగులపల్లి, రాళ్లకుంట, దొరసానిపాడు, జి.కొత్తపల్లి గ్రామాల్లో పందేలు భారీగా జరిగాయి.

మొండికోడులో సంక్రాంతి కలిపింది అందరినీ



సంక్రాంతి సందర్భంగా మొండికోడులో కలిసిన కలిదిండి కుటుంబ సభ్యులు

ఏలూరు రూరల్: సంక్రాంతి పండుగ బంధువుల మధ్య అనుబంధాలు, ఆప్యాయతను మరోసారి గుర్తుచేసింది. ఆదివారం ఏలూరు మండలం మొండికోడు గ్రామానికి చెందిన మూడు తరాల కలిదిండి కుటుంబ సభ్యులు కలుసుకున్నారు. మాజీ సర్పంచ్ కలిదిండి అప్పలరాజు ఆధ్వర్యంలో సుమారు 200 మంది సమావేశమయ్యారు. ఈ సందర్భంగా యువకులు పెద్దలను సత్కరించారు. పెద్దలు పిల్లలకు కానుకలు, పిండివంటలు చేసి పెట్టారు. అందరూ కలిసి ఉత్సాహంగా పండుగ చేసుకున్నారు. గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు, ఎంపీపీ పెన్మత్స శ్రీనివాసరాజు తన కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు.

ముగిసిన యువజనోత్సవాలు



పాత చింతలపూడిలో నిర్వహించిన ముగ్గుల పోటీలు

చింతలపూడి : పండగల పేరుతో యువత చెడు వ్యసనాలకు లోనుకాకుండా క్రీడలు దోహదపడతాయని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.కృష్ణ చైతన్య అన్నారు. స్థానిక పాత చింతలపూడిలో సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన యువజనోత్సవాలు సోమవారం ముగిశాయి. ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు కబడ్డీ, పరుగు పోటీలు, ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా తొర్లపాటి బాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. యువత జూదాల జోలికి పోకుండా వాలీబాల్, రన్నింగ్, ముగ్గుల పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. గ్రామీణ క్రీడలను ప్రభుత్వం ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి కె.గురవయ్య, పి.సోమశేఖర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ముళ్ళగిరి ఇమ్మానియేలు, పల్లే పరదేశి, కంభం సుజాత, బోడ వజ్రం తదితరులు పాల్గొన్నారు.

నేడు రైతన్నల ఖాతాల్లోకి రూ. 200 కోట్లు బదిలీ

దెందులూరు: అన్నదాతలకు సంక్రాంతి పండుగ ఆనందాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నింపారని వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. సోమవారం దెందులూరు ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ధాన్యం సేకరించిన 22 రోజులలోపే రైతుల ఖాతాల్లో రూ. 4813 కోట్లు జమ చేశారన్నారు. రికార్డు స్థాయిలో 25.93 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించారని తెలిపారు. నేడు రైతన్నల ఖాతాలకు రూ.1,500 కోట్లు బదిలీ చేయనున్నారు. రైతు పక్షపాతి సీఎంగా జగనన్న నిలబడి ఎన్నో సంక్షేమ అభివృద్ధి పథకాలు అందిస్తున్నారన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఇప్పటి వరకు రాష్ట్రంలో 25.93 లక్షల టన్నుల ధాన్యాన్ని చేసినట్టు తెలిపారు. దళారీ, మిల్లర్ల పాత్ర లేకుండా ధాన్యం కొనుగోలు చేసి, హమాలీ, గన్ని, రవాణా చార్జీలు రాష్ట్ర ప్రభుత్వం జమ చేసిందన్నారు. జగనన్న నాయకత్వంలో ఏపీలో వ్యవసాయం పండుగలా మారిందని ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి అన్నారు.

హరిలో రంగ హరి

ఆకివీడు: వంశపారంపర్య వృత్తిగా హరిదాసు వృత్తిని వదులుకోలేకపోతున్నామని, సంస్కృతిని కాపాడాలనే ఉద్దేశంతో పండుగ రోజుల్లో గ్రామాల్లో తిరుగుతున్నామని హరిదాసు పరంకుశం రాంబాబు చెప్పారు. మండలంలోని కుప్పనపూడి గ్రామంలో సంక్రాంతి పండుగ ముగింపు సందర్భంగా ఆయా ఇళ్లవద్దకు వెళ్లి 'శ్రీమద్రామాయణ గోవిందో హరి' అంటూ పండుగ ముగిసిందని చెబుతూ ఇంటింటికీ తిరుగుతున్నారు. నాలుగు తరాలుగా హరిదాసు వృత్తిని కొనసాగిస్తున్నామని, నెల పట్టిన రోజుల్లో గ్రామం అంతా తిరిగి ప్రదిక్షణలు చేస్తామని చెప్పారు. తన ముత్తాత కుప్పనపూడిలో హరిదాసుగా పనిచేశారని, తాత, తండ్రి ఇదే ప్రాంతంలో సంక్రాంతి పండుగను ప్రజలతో పంచుకున్నారని చెప్పారు. బతుకుతెరువు కోసం గ్రామం వదలి అమరావతిలో ఉంటున్నామని, అక్కడ నుంచి ప్రతి సంక్రాంతి పండుగ నెల రోజులూ గ్రామంలోనే ఉంటామని చెప్పారు. గ్రామస్తులు పెద్ద మనస్సుతో అన్ని విధాలుగా ఆదుకుంటున్నారన్నారు. 30 ఏళ్లగా హరిదాసుగా పనిచేస్తున్నట్లు రాంబాబు వివరించారు.

ఆలయాల్లో విశేష పూజలు

భీమడోలు: ధనుర్మాసంలో భాగంగా సంక్రాంతి, కనుమ పండుగలను పురస్కరించుకుని సోమవారం వేంకటేశ్వర స్వామి, సీతారామస్వామి, శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. గ్రామాల్లో స్వామి వార్లను ఊరేగించారు. మండలంలోని భీమడోలు, పూళ్ల, గుండుగొలను తదితర గ్రామాల్లో స్వామి వార్లకు విశేషంగా పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసారు. గుండుగొలనులోని సీతారామ స్వామి, వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో పూజారులు సుధీరాచార్యులు, మంగపతి ఆచార్యులు ఆధ్వర్యంలో భీమడోలులో వేంచేసియున్న పార్వతీ సమేత భీమేశ్వర స్వామి, వేంకటేశ్వర స్వామి వార్ల పూజారులు బృందావన పవన్, కాళ్లకూరి ఉమాశంకర్‌శర్మ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. మేళతాళాల నడుమ స్వామి వార్లకు గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని కానుకలు చెల్లించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఈ కార్యక్రమాల్లో గుండుగొలను శ్రీవేంకటేశ్వర స్వామి వారి ఆలయ కమిటీ మాజీ అధ్యక్షుడు వగ్వాల మీనాకుమారి అచ్యుతరామారావు, పెద్దలు పాల్గొన్నారు.

వైభవంగా గోదాదేవి కల్యాణం

దెందులూరు: దెందులూరులోని విష్ణులాయంలో సోమవారం గోదాదేవి కల్యాణం వైభవంగా నిర్వహించారు. గ్రామస్తులు అధిక సంఖ్యలో కల్యాణాన్ని తిలకించారు. తొలుత ఆలయ అర్చకులు గోదాదేవికి వివిధ పుష్పాలతో విశేషాలంకరణ చేశారు. చిన్నారుల నృత్యప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది.



గుండుగొలనులో వేంకటేశ్వర స్వామికి హారతులిస్తున్న దృశ్యం



ప్రత్యేక అలంకరణలో గోదాదేవి అమ్మవారు



గుండుగొలనులో అయ్యప్ప స్వామికి విశేష అలంకరణ

అయ్యప్ప ఆలయాల్లో మకర జ్యోతి దర్శనం

భీమడోలు: గుండుగొలనులో శ్రీధర్మశాస్త ఆలయంలో కొలువైన అయ్యప్ప స్వామి వార్ల ఆదివారం రాత్రి మకర జ్యోతి దర్శన వేడుక అంగరంగ వైభవంగా జరిగింది. స్వామి వారికి వివిధ రకాల పువ్వులతో విశేషంగా అలకరించి ముస్తాబు చేసారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. ఆలయ పూజారులు లంకా శివకుమార్, లంకా శ్రీనివాస్ ఆధ్వర్యంలో మకర సంక్రాంతిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేసారు. మకర జ్యోతిని ఆకాశంలోకి వదిలిన ఈ ఘట్టాన్ని పరిసర గ్రామాలకు చెందిన భక్తులు తిలకరించి ఆనందించారు. పూళ్లలోని అయ్యప్ప స్వామి ఆలయంలో డీసీసీబీ మాజీ డైరెక్టర్ పుప్పాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో మకర జ్యోతి దర్శనం కార్యక్రమం వైభవంగా జరిగింది. ఆలయంలోని స్వామి వారి ఆభరణాలతో గ్రామోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం స్వామి వారికి ఆభరణాలను అలంకరించారు. భారీగా బాణసంచా కాల్చారు. 18 దీపాలను వెలిగించి భక్తులు పూజలు చేసారు. దీనితో ఆలయాల్లో స్వామి వార్లను దర్శించుకునేందుకు ప్రజలు బారులు తీరారు. ఈ కార్యక్రమాల్లో గ్రామస్తులు, మహిళలు, భజన మండలి సభ్యులు పాల్గొన్నారు.



భీమడోలులో వేంకటేశ్వర, శివాలయాల్లోని స్వామి వార్లను ఒకే ట్రాక్టర్‌పై ఊరేగిస్తున్న దృశ్యం



కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

సంప్రదాయాలను పరిరక్షించాలి

పెంటపాడు: తెలుగు పండుగలు, సంస్కృతి,సంప్రదాయాలను ప్రతి ఒక్కరూ పాటించేలా యువత పాటు పడాలని గూడెం రూరల్ సీఐ మూర్తి కోరారు. ఉమామహేశ్వరంలో గ్రామ దేవత పెంట్లమ్మ అమ్మవారి 12 వార్షికోత్సవం పురస్కరించుకొని ఆదివారం నిర్వహించిన ముగ్గులు, క్రీడా పోటీల్లో విజేతలైన వారికి ఆయన బహుమతులు అందించారు. రాయుడు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో సీఐ మాట్లాడుతూ యువత చెడు వ్యసనాల బారిన పడి జీవితాలను వృథా చేసుకుంటున్నారన్నారు. ఈ సంస్కృతిని విడనాడి క్రీడలు, చదువు, సేవా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అనంతరం రాయుడు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆయన తండ్రి దివంగత రాయుడు సాంబయ్య జ్ఞాపకార్థం రెవెన్యూ, పోలీసు సిబ్బందికి వస్త్రదానంతో పాటు, పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు.

ఘనంగా పుంతలో ముసలమ్మ 50వ వార్షికోత్సవం

నిడమర్రు: బావాయిపాలెం పుంతలో ముసలమ్మ అమ్మవారి ఆలయ వార్షికోత్సవాలు ఈనెల 16 నుంచి 22వ తేదీ వరకూ నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు ముత్యాల పెదబాబు తెలిపారు. వార్షికోత్సవాలు ప్రారంభమై 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈ ఏడాది ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రతిరోజూ ఆలయం వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు, భజనలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు, మ్యూజికల్ నైట్, డ్యాన్స్ బేబీ డ్యాన్స్ వంటి కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. ఉత్సవాల సందర్భంగా అమ్మవారిని, ఆలయాన్ని పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో రంగురంగుల విద్యుత్ దీపాలంకరణలు చేసి శోభాయమానంగా తీర్చిదిద్దారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా 22వ తేదీ ఆదివారం మాంసాహారంతో భారీ అన్నసమారాధన ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఉత్సవాల ప్రారంభం సందర్భంగా సోమవారం అమ్మవారికి గ్రామస్తులు భారీ ఊరేగింపుతో చలిమిడి పానకాల తెచ్చారు. బ్యాండుమేళాలతో గ్రామస్తులు కావిళ్లతో ప్రదర్శనగా గ్రామంలోని శివాలయం వద్ద నుంచి ఊరిచివర ఉన్న పుంతలో ముసలమ్మ అమ్మవారి ఆలయానికి తీసుకువచ్చి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి, పూజలు నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాలనుంచి వేలాదిగా ప్రజలు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని, పూజలు చేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.



పూలతో అలంకరించిన పుంతలో ముసలమ్మ అమ్మవారి ఆలయం

మెర్విన్ జోన్స్ సేవలు చిరస్మరణీయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): అంతర్జాతీయ లయన్స్ క్లబ్ ఫౌండర్ మెర్విన్ జోన్స్ జయంతిని పట్టణంలో లయన్స్‌క్లబ్ ఆఫ్ డైమండ్స్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జోన్స్ చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మహిళలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. వక్తలు మాట్లాడుతూ మెర్విన్ జోన్స్ సేవలు చిరస్మరణీయమని, ప్రపంచ వ్యాప్తంగా ప్రతి 2 నిమిషాలకు ఏదో ఒక సేవా కార్యక్రమం లయన్స్ ఆధ్వర్యంలో జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కొంతాల బాబు, పేరిచర్ల మురళీకృష్ణంరాజు, నార్ని వెంకట కృష్ణారావు, యాదాల శివాజీ, ఎం.రాము, ఎ.శ్రీనివాస్, ఎ.ఉమా మహేశ్వరరావు, బాలబొమ్మల శ్రీనివాస్, ఎం.శివరామరాజు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కొఠారు పరామర్శ

దెందులూరు: దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి సోమవారం కొవ్వలిలో కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్ కొమ్మిన రాము తండ్రి వైఎస్సార్‌సీపీ నేత ప్రసాద్‌ను ఆయన స్వగృహంలో పరామర్శించారు. ప్రసాద్ ఇటీవల ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డారు. ప్రసాద్ త్వరితగతిన సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. సర్పంచ్ ఇంటేటి మధులతా గంగాధర్, పార్టీ అధ్యక్షుడు కాటి సుధాకర్, వైస్ ఎంపీపీ గొల్ల నాగరాజు, ఎంపీటీసీ గోరిపర్తి వరలక్ష్మి రంగారావు, నాయకులు ఉన్నారు.

27 కేసుల్లో 102 మంది అరెస్టు

భీమడోలు: కోడి పందేల స్థావరాలపై సోమవారం భీమడోలు పోలీసులు దాడులు నిర్వహించారు. కోడి పందేలు, జూద క్రీడలను నిర్వహించే వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. మండల వ్యాప్తంగా సంక్రాంతి పండుగను సందర్భంగా కోడి పందేలు, గాంబ్లింగ్ ఆటలు ఆడించిన వ్యక్తులపై కేసు నమోదయ్యాయి. భీమడోలు ఎస్సై చావా సురేష్‌కుమార్ తన సిబ్బందితో కలిసి ఆకస్మిక దాడులు చేసారు. మండల వ్యాప్తంగా 27 కేసులకు సంబంధించి 102 మంది జూదరులను అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి నుంచి 12 పందెం కోడి పుంజులు, రూ.31,120 స్వాధీనం చేసుకున్నామని ఎస్సై చావా సురేష్‌కుమార్ పేర్కొన్నారు.

గుండాట నిర్వాహకుల అరెస్టు

గణపవరం: గణపవరం మండలంలో పలు గ్రామాల్లో గుండాట, పేకాట నిర్వహిస్తున్న వారిపై గణపవరం సీఐ ఎంవీ సుభాష్, ఎస్సై వేముల వెంకటేశ్వరావు ఆది సోమవారాల్లో ఆకస్మిక దాడులు నిర్వహించి 8 మందిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. గణపవరం, సరిపల్లె, ముగ్గళ్ల, పిప్పర, మొయ్యేరు, కేశవరం, కాశిపాడులో నిర్వహిస్తున్న కోడిపందేలపై దాడులు చేశారు. జూద నిర్వాహకులను అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేశారు. గుండాట బోర్డులను స్వాధీనం చేసుకుని, టెంట్లు తొలగించారు.

పేకాట స్థావరాలపై దాడి

పెంటపాడు: పెంటపాడు పోలీసులు పేకాట స్థావరాలపై ఆదివారం దాడులు నిర్వహించారు. పెంటపాడు కొబ్బరితోటలో పేకాడుతున్న 22 మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ. 3.60 లక్షలు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై జి. సత్యనారాయణ తెలిపారు.